# 58. పూసలార్ నాయనారు

పూసలారు తొండైమండలములోని తిరునిన్రావూరు బ్రాహ్మణుడు. ఆయన మానసికోపాసన మహోత్కృష్టముగా భాసించింది. బాహ్య విగ్రహారాధన కన్న మానసిక పూజ వెయ్యిరెట్లు అధికమైన మహోత్తృము కలది. మానసికోపాసన సమాధి స్థితిని, ఆత్మ దర్శనమును త్వరితము చేస్తుంది.

పూసలారు పరమశివునికి దేవాలయము నిర్మింపదలచాడు. దానికొఱకు ఆయనవద్ద ధనము లేకపోయింది. అందుచే మనోమందిరమును నిర్మింపదలచి ఆ దేవాలయమునకు వలసిన సరంజామా అంతా మనసులోనే సేకరించి ఒక మంచి ముహూర్తాన శంఖు స్థాపన చేశాడు. మనోమందిరము పూర్తిఅయింది. దేవుని ఆదేవళములో నిలుపుటకు ఒక స్థిరముహూర్తము నిశ్చయించాడు.

ఇలా వుండగా కడవ రాజుగూడ కంచిలో ఒక బృహదీశ్వరాలయము నిర్మించాడు. దైవ ప్రతిష్ఠకు ఒక ముహూర్తము నిర్ణయించాడు. కడవరాజుగూడ పరమశివ భక్తుడు. కాకతాళీయంగా పూసలారు ముహూర్తము, కడవరాజు ముహూర్తము ఒకటే అయినవి. పరమశివుడు పూసలారుయొక్కభక్తి అభినివేశము భక్తి ప్రపత్తి - రాజుగారి భక్తిని మించిపోయిందని లోకానికి తెలియబరచ దలచాడు. అందుకని రాజుగారి కలలో కనిపించి కంచిదేవాలయంలోదైవ ప్రతిష్ఠకు ఇంకొక ముహూర్తము నిర్ణయించ వలసినదనియు - ఆ సమయమునకు తానుమహాభక్తుడైన పూసలారు నిర్మించిన మందిరములో ప్రతిష్టకు వెళ్తునట్లుగాను చెప్పాడు.

రాజుగార్కి ఆశ్చర్యమేసింది. నిద్రలేచి భగవంతుడు పేర్కొన్న భక్తుడైన పూసలారు దర్శనము చేసికొనుటకును, అతను నిర్మించిన దేవాలయం దర్శించుటకును తిరునిన్రావూరు వెళ్లాడు. అక్కడ దేవాలయము వెదికాడు. కన్పించలేదు. పూసలారు గృహమునకు వెళ్లి - ఆయనకు తన కలగూర్చి చెప్పి పూసలారు నిర్మించిన దేవాలయమును చూపమని అర్థించాడు. రాజుగారి కలవినగానే పూసలారు స్థబ్ధుడయ్యాడు. “నేనెంత సామాన్యుడను. దేవదేవుడు ఎంత ఔదార్యముతో నా మానసిక మందిరం నే తన మందిరంగా భావించ నిచ్చగించాడు ? ఎంత కొరుచమూర్తి. నన్ను నిజముగ ధన్యునిగా చేశాడు మహేశ్వరుడు”అనుకొని -రాజుగారితో “మహారాజా ! దేవదేవుడు కరుణామయుడు. అది నా మానస మందిరమే” అని చెప్పాడు. రాజుగారికి పరమాశ్చర్యము వేసింది. పూసలారు అనితర భక్తికి ముగ్ధుడై ఆయన కాళ్లకు మొక్కాడు. పూసలారును

బహుధి అర్చించాడు. పూసలారు తాను అనుకున్నవిధంగా తనమానస మందిరములో దేవదేవుని వుంచాడు. ప్రతిష్టచేసి - నిరంతరార్చన సలిపాడు. అంత్యమున పూసలారు పరమశివుని సాన్నిధ్యానికి చేరాడు.